

మాట్లాడుతున్న హైకోర్టు సీనియర్ న్యాయవాది డాక్టర్ టి. సుభాషిణి

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● హైకోర్టు సీనియర్ న్యాయవాది డాక్టర్ టి. సుభాషిణి

ముషీరాబాద్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు రాజ్యాంగం కల్పించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని హైకోర్టు సీనియర్ న్యాయవాది డాక్టర్ టి. సుభాషిణి అన్నారు. ఆదివారం న్యాయసేవల దినోత్సవాన్ని పురస్కరించుకొని ముషీరాబాద్‌లోని రెయిన్‌బో హోం అనాథాశ్రమంలో న్యాయసేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సుభాషిణి మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించే విధంగా తమ వంతు కృషిచేస్తున్నాం అన్నారు. న్యాయ సలహాలపై లీగల్ వలంటీర్లు స్వచ్ఛందంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధి ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న భోలక్‌పూర్ మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయం ఖాయం

ముషీరాబాద్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ ఘన విజయం సాధించడం ఖాయమని భోలక్‌పూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా జూబ్లీహిల్స్‌లోని షేక్‌పేట్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వాజీద్ హుస్సేన్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు అన్నివర్గాల ప్రజలు ఆకర్షితులై కాంగ్రెస్‌ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకుల మాయమాటలు ప్రజలు నమ్మేస్థితిలో లేరని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయ ఢంకా మోగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రహీం, నియాజ్ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో మాగంటి సునీత విజయం ఖాయం


కేటీఆర్ ర్యాలీలో పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు హరిబాబుయాదవ్

ముషీరాబాద్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత భారీ మెజార్టీతో ఘన విజయం సాధించడం ఖాయమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎడ్ల హరిబాబు యాదవ్ అన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని యూసుఫ్‌గూడలో బీఆర్ఎస్ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు కేటీఆర్ నిర్వహించిన రోడ్‌షోలో ముషీరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎడ్ల హరిబాబుయాదవ్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్‌లో ప్రజాదరణ బీఆర్ఎస్‌కే ఉందని అన్నివర్గాల ప్రజలు మాగంటి సునీతకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, కేటీఆర్ నిరంతరం ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్నందుకు ప్రజలు బీఆర్ఎస్‌కు అండగా నిలిచారని ఈ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమ, బీఆర్ఎస్ నాయకులు అభినందన్‌యాదవ్, వీరేష్ పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ కవాడిగూడ నేతలు

జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ గెలవడం ఖాయం

కవాడిగూడ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ఆ పార్టీ కవాడిగూడ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వల్లాల శ్యామ్‌యాదవ్, ఎన్‌డీ సాయికృష్ణ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో భాగంగా షేక్‌పేట డివిజన్‌లో కవాడిగూడ బీఆర్ఎస్ నేతలు విస్తృతంగా ప్రచారం చేసినట్లు వారు తెలిపారు. ఈనెల 11న జరిగే జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర నాయకులు ఆర్ రాంచందర్, రాజేష్, రఫీయుద్దీన్, డాక్టర్ శ్రీహరి, దుర్గాస్వామి, హరీష్‌యాదవ్, మధు, హరి, ప్రవీణ్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న అస్మా తదితరులు

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ఓటమే తన గెలుపు

● నిరుద్యోగ జేఏసీ నేత, ఇండిపెండెంట్ అభ్యర్థి అస్మా

చిక్కడపల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతుందని ఆ పార్టీ ఓటమే తన గెలుపు అని నిరుద్యోగ జేఏసీ నేత, ఇండిపెండెంట్ అభ్యర్థి అస్మా అన్నారు. ఆదివారం చిక్కడపల్లి సిటీసెంట్రల్ లైబ్రరీ నిరుద్యోగులు అస్మాతోపాటు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అస్మా మాట్లాడుతూ టార్చ్‌లైట్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలన్నారు. నిరుద్యోగులు శంకర్‌నాయక్, ఇంద్ర, శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయకుంటే ఈ ఎన్నికతో పాటు వచ్చే అన్ని ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌ని ఓడిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ఈ జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ఓడిపోతేనే ఆ పార్టీకి కనువిప్పు కలిగి రాష్ట్రంలో చేయాల్సిన పనులు జరుగుతాయన్నారు. తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేసి నిరుద్యోగులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నవీన్‌పట్నాయక్, వెంకటేష్, రమేష్, కుమార్, శ్రీకాంత్, సంపత్, మధు, శ్రీనివాస్, రేవతి, శాంతి పాల్గొన్నారు.

వైభవంగా మహాలింగార్చన

చిక్కడపల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీక్రాస్‌రోడ్ లక్ష్మీగణపతి ఆలయం ఆవరణలో ఉన్న పార్వతీక్షీరలింగేశ్వరస్వామి మందిరంలో జరుగుతున్న కార్తీకమాస మహోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి మహాలింగార్చన పూజాకార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. స్వామివారికి లింగాలతో అభిషేకం నిర్వహించడం ఈ పూజలో ప్రత్యేకత. ఈసందర్భంగా ఏకాదశరుద్రాభిషేకం, మహన్యాసరుద్రాభిషేకం, ఆకాశదీపపూజ, కార్తీకపురాణ ప్రవచనం, భక్తులచే దీపారాధన, ప్రదోషపూజ, బిల్వార్చన, నివేదన, హారతి, మహామంత్ర పుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను ఆలయ ఈవో లక్ష్మారెడ్డి, చైర్మన్ మారిశెట్టి నర్సింగ్‌రావు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

హాస్టళ్లు, గురుకులాలకు భవనాలు నిర్మించాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య

కవాడిగూడ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను అమ్మవద్దని, ఆ స్థలాల్లో ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, బీసీ యువజన సంఘం అధ్యక్షుడు జిల్లపల్లి అంజి ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద వందలాదిమంది విద్యార్థులతో మహాధర్నా, ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వ భూములను అమ్మితే భావితరాలకు ఏమి మిగులుతుందని ప్రభుత్వ భూముల వేలాన్ని అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. భవన నిర్మాణాలకు 80శాతం గ్రాంట్ కేంద్రప్రభుత్వం ఇస్తుందని మల్టీనేషనల్ కంపెనీల నుంచి సీఎస్ఆర్‌ఫండ్స్ తీసుకొని భవనాలను నిర్మించాలని దీనికి పార్లమెంటు సభ్యులం కృషి చేస్తామని ఆయన అన్నారు. అద్దె భవనాల్లో విద్యార్థులు చాలీచాలని వసతులతో ఇబ్బందులు పడుతున్నారని అన్ని వసతులతో సొంత భవనాలు నిర్మిస్తే హాస్టల్, గురుకుల విద్యార్థులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని ఆయన అన్నారు. హాస్టళ్లకు ఎనిమిది నెలల మెస్ బిల్లులు బకాయిలు వెంటనే చెల్లించాలని, అద్దెభవనాల బకాయిలు కూడా మూడేళ్లుగా చెల్లించడం లేదని వీటిని వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ, పీజీ, డిగ్రీ, ఇంటర్ కోర్సులు చదివే బీసీ విద్యార్థుల మొత్తం ఫీజులను ప్రభుత్వమే భరించాలని ఈ కోర్సులకు ఉన్న ఫీజుల గరిష్ట పరిమితిని ఎత్తివేసి గతంలో మాదిరిగా పూర్తి ఫీజులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీలకు 240 రెసిడెన్షియల్ పాఠశాలలు, 150 బీసీ కాలేజీ హాస్టళ్లను తక్షణమే మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి హాస్టళ్లలో నాలుగు నుంచి పది కంప్యూటర్లు, లైబ్రరీ బుక్స్ అందుబాటులో ఉంచాలన్నారు. కాలేజీ హాస్టల్ విద్యార్థులకు బాలికలకు రూ.1000, బాలురకు రూ.800 పాకెట్ మనీ మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం కోఆర్డినేటర్ ర్యాగ అరుణ్‌కుమార్, బీసీ సంఘాల నేతలు జి అనంతయ్య, పగిళ్ల సతీష్, శివకుమార్‌యాదవ్, సి రాజేందర్, భీంరాజ్, అజయ్, అంజిగౌడ్, బోయ గోపీ తదితరులు పాల్గొన్నారు.


ఇందిరాపార్కు వద్ద ప్రదర్శన నిర్వహిస్తున్న ఎంపి ఆర్ కృష్ణయ్య

రచయితలు, కవులు సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

● ప్రముఖ రచయిత్రి కాత్యాయిని


వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న రచయిత్రి కాత్యాయిని, కవులు, కళాకారులు

రాంనగర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : యువ రచయితలు, కవులు, కళాకారులు తమ సృజనకు పదునుపెట్టి సమాజ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ప్రముఖ రచయిత్రి కాత్యాయిని విద్మహే పిలుపునిచ్చారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 22న కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయంలో యూత్ లిటరేచర్ ఫెస్టివల్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కళలు, కలాలు ఏం చేయాలనే దానిపై ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎప్పుడైతే మనుషుల మధ్య విభజన రేఖలు గీసి అడ్డుగోడలు నిర్మిస్తున్నారో వాటిని ఛేదించాల్సిన బాధ్యత రచయితలు కళాకారులదేనని అన్నారు. నేటి యువత మత, కులతత్వ శక్తుల బారిన పడకుండా మానవతా వాదం వైపు నడిపించడమే ప్రధాన ఉద్దేశంగా ఈ ఉత్సవాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈసందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎకే ప్రభాకర్, పసునూరి రవీందర్, సామిడి జగన్‌రెడ్డి, మెర్సిమార్గరేట్, స్కైబాబా, యువరాణి, నాళేశ్వరం శంకరం, మోత్కూర్ శ్రీనివాస్, శ్రీనిధి తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్ ప్రారంభం

ఈనెల 22న యూత్ లిటరేచర్ ఫెస్టివల్ జరుపనున్నట్లు సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం కార్యవర్గ సమావేశంలో ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. సుందరయ్యవిజ్ఞాన కేంద్రం తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో ప్రముఖ రచయిత్రి కాత్యాయని విద్మహే పాల్గొని ఇప్పుడు కళలు, కలాలు ఏం చేయాలనే అంశంపై కవులు, కళాకారులు, రచయితలు తమ సృజనకు పదును పెట్టాలని ఈ సాహిత్య ఉత్సవాల్లో భాగం కావాలని పిలుపునిచ్చారు. భూపతి వెంకటేశ్వర్లు, ఎకె ప్రభాకర్, పసునూరి రవీందర్, జగన్‌రెడ్డి, మార్గరెట్, స్కైబాబ, యువరాణి, నాళేశ్వరం శంకరం, మోత్కూరి శ్రీనివాస్, శ్రీనిధి తదితరులు పాల్గొన్నారు.


గీతాలను ఆలపిస్తున్న గాయనీగాయకులు

అలరించిన పాత చిత్రాల గీతాల విభావరి

చిక్కడపల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకళాంజలి కళా పరిషత్ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయగాన సభలో నిర్వహించిన పాతచిత్రాల గీత విభావరి శ్రోతలను అలరించింది. వేణుమాస్టర్, కామేశ్వరి, రామకృష్ణ తదితరులు ఎంపిక చేసుకున్న పలు గీతాలను ఆలపించారు. ఈసందర్భంగా గాయనీగాయకులను నిర్వాహకులు వేణుమాస్టర్ అభినందించారు.


అన్నదానం నిర్వహిస్తున్న సత్యసాయిసేవాసమితి సభ్యులు

సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం

చిక్కడపల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండో ఆదివారం నిర్వహించే అన్నదానం కార్యక్రమాన్ని చిక్కడపల్లి సిటీసెంట్రల్ లైబ్రరీలో నిర్వహించారు. ఈసందర్భంగా 300 మంది పేదలు, నిరుద్యోగ విద్యార్థులకు భోజన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ రామకృష్ణ, సభ్యులు రామారావు, రవికిరణ్, పాండురంగ, సాంబశివరావు, నాగరాజు, హరిప్రసాద్, అభిషేక్, వణి పాల్గొన్నారు.

కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

● కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ కురుమ


అభివాదం చేస్తున్న నర్సింహ కురుమ, మహేందర్‌కుమార్, వెంకటేష్ కురుమ

రాంనగర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : కురుమల హక్కుల కోసం తమ సంఘం పోరాటం చేస్తుందని తెలంగాణ కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు గొరిగే నర్సింహ కురుమ పేర్కొన్నారు. వెనుకబడిన కురుమల సంక్షేమం కోసం కురుమల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో కురుమ యువ చైతన్య(కేవైసీఎస్) 6వ వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కురుమల హక్కుల కోసం తాము ఎంతగానో కృషి చేస్తున్నట్లు తెలిపారు. కురుమ జనాభా దామాషా అన్ని పార్టీలు తమకు రాజకీయ ప్రాతినిధ్యం ఇవ్వాలన్నారు. ట్యాంక్‌బండ్‌పై దొడ్డి కొమురయ్య విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జనగామ జిల్లాకు దొడ్డి కొమురయ్య పేరుపెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎ.మహేందర్‌కుమార్, ఉపాధ్యక్షుడు వెంకటేష్ కురుమ, కో-ఆర్డినేటర్ కామగంటి వెంకటేష్ కురుమ, రాజ్‌కుమార్, బండారు శ్రీశైలు, నీళ్ల రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అఖిలభారత బ్రహ్మసమాజ్ సమావేశం


బ్రహ్మసమాజ్ వేడుకల్లో పాల్గొన్న నిర్వాహకులు

బర్కత్‌పుర, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కాచిగూడ మున్నూరుకాపు భవన్‌లో రెండు రోజుల పాటు జరిగిన 134వ అఖిల భారత బ్రహ్మసమాజ్ సమావేశం ఆదివారం ముగిసింది. హైదరాబాద్ దక్కన్ బ్రహ్మసమాజ్ ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు. వేద పారాయణం, ఆధ్యాత్మిక ప్రసంగాలతో వక్తలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఈసందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గోప చందా మాట్లాడుతూ భగవంతుడితో స్నేహం అనేది మానవుడికి లభించిన అత్యంత వరం అన్నారు. కల్యాణి చటోపాధ్యాయ, రాజారామ్మోహన్ వంటి మహనీయుల ఆధ్యాత్మిక సేవలు నేటి తరానికి మార్గదర్శకం అన్నారు. మరో ఆధ్యాత్మికురాలు మధుబిందు మాట్లాడుతూ జీవితంలో కృతజ్ఞత, ఆత్మజ్ఞానం వంటి విలువల ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రేఖా సహాని మాట్లాడుతూ యువత సమాజసేవలో భాగస్వాములై బ్రహ్మసమాజ విలువలను విస్తరింపచేయాలన్నారు. వేదభ్యాసం అందరికీ అందుబాటులో ఉండేలా దక్కన్ బ్రహ్మసమాజ్ కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా శ్రీరథీశంకర్ కథాకథన కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. డాక్టర్ వి.వి.లక్ష్మీనారాయణ, దాసరి భారతప్రసాద్‌లు సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిమేష్‌ప్రభు, బి.ఆత్మీ, డాక్టర్ కుమార్, డాక్టర్ శోభారాయ్, దేవప్రతసర్కార్, సర్వేష్‌నాయక్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి

● బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ


మాట్లాడుతున్న బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ

బర్కత్‌పుర, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో కల్పించిన 42శాతం రిజర్వేషన్లను వచ్చే పార్లమెంటు సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించే విధంగా అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి మోదీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తీసుకురావాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. రాజ్యాంగ సవరణ ద్వారానే బీసీ రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చి చట్టబద్ధత కల్పించాలని ఆయన కోరారు. ఆదివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు బీసీ రిజర్వేషన్లపై వచ్చే పార్లమెంటు సమావేశాల్లో స్తంభింపచేసి కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని ఆయన కోరారు. తమిళనాడు తరహాలో బీసీ రిజర్వేషన్లను సాధించుకోవాలని ఇందుకోసం తీవ్ర స్థాయిలో ఉద్యమం చేపట్టాలని నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో పూర్తి చేసిన కులగణన సర్వే వివరాలను తక్షణమే బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 42శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం నేతలు వంశీ, హరి, జగదీష్, రాహుల్, ప్రణీత్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీజేపీని గెలిపిస్తాయి


ఎన్నికల ప్రచారంలో మాజీ కార్పొరేటర్ రవీందర్, బీజేపీ నాయకుడు వెంకటేష్

కవాడిగూడ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తాయని దోమలగూడ మాజీ కార్పొరేటర్ టి రవీందర్, బీజేపీ రాష్ట్ర నాయకుడు జి వెంకటేష్ అన్నారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని వెంగళ్‌రావునగర్ డివిజన్‌లో వారు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేసి బీజేపీ అభ్యర్థి లంకెల దీపక్‌రెడ్డిని గెలిపించాలని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో బీజేపీ ప్రచారానికి మంచి స్పందన ఉందని రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలవడం ఖాయమని వారు పేర్కొన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో పరిమళ్‌కుమార్, నగరనాయకులు ఎంసీ మహేందర్ బాబు, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సలంద్రి దిలీప్‌యాదవ్, బొల్ల రమేష్, ఓబీసీ మోర్చా డివిజన్ అధ్యక్షుడు ఎ ప్రభాకర్ గంగపుత్ర, పార్టీ నేతలు లింగంగౌడ్, రాగం రవికుమార్, శివరాజ్, రాము తదితరులు పాల్గొన్నారు.

దీపక్‌రెడ్డిని గెలిపించాలి

చిక్కడపల్లి : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కమలంపువ్వు గుర్తుపై ఓటు వేసి బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్ ఓటర్లను అభ్యర్థించారు. ఆదివారం ఎర్రగడ్డ డివిజన్‌లో చివరిరోజు వినయ్‌కుమార్, ఆనంద్‌రావు తదితర పార్టీ నేతలు, కార్యకర్తలు ఎన్నికల ప్రచార పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

కుల రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలి

రాంనగర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కులరహిత సమాజ స్థాపకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. కులంపై కలిసికట్టుగా ఉద్యమిద్దాం అని వారు పిలుపునిచ్చారు. కుల నిర్మూలన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఛాయన్-2025 జాతీయ సదస్సును నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ టి. రజని, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జి. రాధారాణిలు తదితరులు హాజరయ్యారు. విశ్రాంత న్యాయమూర్తులు మాట్లాడుతూ కుల, మతాంతర వివాహాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఛాయన్ సావనీర్‌ను ఆవిష్కరించారు. వహీద్, విమలక్క, స్కైలాబ్‌బాబు, హనుమంత్, స్వరాజ్యలక్ష్మి, సూర్యనారాయణ, బైరి నరేష్ పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు, బెల్ట్‌లు ప్రదానం చేస్తున్న అతిథులు

చదువుతోపాటు మార్షల్ ఆర్ట్స్‌లోనూ శిక్షణ పొందాలి

చిక్కడపల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు మార్షల్ ఆర్ట్స్‌లోనూ శిక్షణ పొందాలని, వారి రక్షణకు అది ఎంతో ఉపయోగపడుతుందని హైదరాబాద్ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. కృష్ణ, మీర్ ఫహాజ్ అలీఖాన్ అన్నారు. గాంధీనగర్ డివిజన్ గాంధీనగర్ కెనరాబ్యాంక్ జీహెచ్ఎంసీ ప్లేగ్రౌండ్‌లో తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ బి. కృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం బెల్ట్ గ్రేడింగ్, కలర్‌బెల్ట్‌లు, సర్టిఫికెట్ల ప్రదాన కార్యక్రమం జరిగింది. కలర్‌బెల్ట్‌లు, సర్టిఫికెట్లు పొందిన 100మందికి పైగా విద్యార్థుల తైక్వాండో ప్రదర్శనలు జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా హాజరైన కృష్ణ, మీర్‌ఫహాజ్ అలీఖాన్‌లు మాట్లాడుతూ సర్టిఫికెట్లు, బెల్ట్‌లు పొందిన విద్యార్థులను అభినందించారు. మహిళలు కూడా మార్షల్ ఆర్ట్స్ నేర్చుకుంటే రక్షణ కోసం ఉపయోగపడుతుందన్నారు. ఎగ్జామినర్ మాస్టర్ సంజయ్, అష్రాఫ్, లక్ష్మీనారాయణ, స్వామి, క్రీడాకారులు పాల్గొన్నారు.


బంగారు పతకాలు సాధించిన విద్యార్థులతో కరాటే మాస్టర్లు శ్రీధర్, శ్రీకాంత్

కరాటే పోటీల్లో ఖైరతాబాద్ క్రీడాకారుల ప్రతిభ

నల్లకుంట : కిక్కర్స్ మార్షల్ ఆర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం నగర శివారులోని రాజేంద్రనగర్ యునైటెడ్ ప్యాలెస్‌లో మొదటి జాతీయస్థాయి పోటీలు మాస్టర్ ఫయాజ్ నిర్వహణలో జరిగింది. నగరంలోని ఖైరతాబాద్ ఓల్డ్ సీబీఐ గ్రౌండ్ కరాటే మాస్టర్ శ్రీధర్, శ్రీకాంత్‌ల శిష్యులు ఒకినవా మార్షల్ ఆర్ట్స్‌లో బంగారు పతకాలు సాధించారు. ఒకినవా మార్షల్ ఆర్ట్స్‌లో శ్రీకాంత్ శిష్యులు 4బంగారు, 3సిల్వర్ మెడల్స్‌తో పాటు టీమ్ చాంపియన్‌షిప్ అందుకున్నారు. ఈసందర్భంగా కరాటే పోటీల్లో బంగారు పతకాలు సాధించిన కరాటే విద్యార్థులను కరాటే మాస్టర్లు శ్రీధర్, శ్రీకాంత్ సత్కరించి అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని బంగారు పతకాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.



ఉచిత బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న తెలంగాణ బ్రాహ్మణ సేవా సమాఖ్య గ్రేటర్ హైదరాబాద్ సభ్యులు

26న బ్రాహ్మణుల వివాహ పరిచయ వేదిక

ఎల్‌బీనగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్రాహ్మణ సేవా సమాఖ్య గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో జనవరి 26న ఉచిత బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు బ్రాహ్మణ సమాఖ్య గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మునిపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఎల్‌బీనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్ వెన్నంపల్లి జగన్మోహన్‌శర్మ, అధ్యక్షుడు మోత్కూరు రామేశ్వరరావుతో కలిసి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మునిపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, నాగోల్ రాక్‌టౌన్‌కాలనీలోని గోటేటి కల్యాణ వేదికలో జనవరి 26న బుధవారం ఉచిత బ్రాహ్మణుల వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉచిత వివాహ పరిచయ వేదికను రాష్ట్రంలోని బ్రాహ్మణులంతా సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 7036002288 మొబైల్‌లో సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ బ్రాహ్మణ సేవా సమాఖ్య భాస్కర మూర్తి, విజయలక్ష్మి, గొల్లపూడి శర్మ తదితరులు ఉన్నారు.


జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ఆదివారం ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యేలు తన్నీరు హరీష్‌రావు, కృష్ణారావు, సునీతాలక్ష్మారెడ్డి, అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్, శ్రవణ్ - బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి

రైలు ప్రయాణికుడి బంగారు గాజులు తస్కరణ

బర్కత్‌పుర, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : రైలు ప్రయాణికుడి బంగారు గాజులను దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మీర్‌పేటలో నివాసం ఉం టున్న కందికొట్ల వినయ్‌కుమార్ రేణిగుంటలో చెంగల్పట్టు ఎక్స్‌ప్రెస్ రైలుఎక్కి నగరానికి వస్తున్నాడు. కాచిగూడ రైల్వేస్టేషన్ సమీపంలో లగేజ్ బ్యాగును సీటుపై ఉంచి బాత్రూమ్‌కు వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి బ్యాగు కనిపించలేదు. ఆ బ్యాగులో 12గ్రాముల బంగా రు గాజులు, వెయ్యి రూపాయల నగదు, డెబిట్ కార్డులు ఉన్నాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.